# తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర సదస్సు

- హామీల అమలుకు డిమాండ్



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం శనివారం హైదరాబాద్‌లోని తార్నాకలో మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర సదస్సును కూడా నిర్వహించి, ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమం డా. చీమ శ్రీనివాస్ నాయకత్వంలో జరిగింది. ఈ సదస్సుకు టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమం అమరవీరుల త్యాగాల ఫలితంగా సాధ్యమైందని గుర్తుచేశారు. ఆ త్యాగాలను గౌరవిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉద్యమకారులకు అండగా నిలుస్తుందని, వారి వినతులను తప్పకుండా పరిష్కరించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. అలాగే, తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి గారు కూడా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకుడిగా, ఉద్యమకారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తారని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో దయానంద్ గంగపుత్ర, జగన్, నరసింహాచారి, రాంబాబు తదితరులు సహా అనేక మంది ఉద్యమకారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశంలో ముఖ్యంగా ఉద్యమకారులకు ఉద్యోగాలు, గౌరవ వేతనాలు, నివాస స్థలాల కేటాయింపు, ఆరోగ్య సదుపాయాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఆలస్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇదిలా ఉండగా, ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక విధానాలు రూపొందించాలని, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది. అవసరమైతే భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని నాయకులు హెచ్చరించారు.



# బీజేఆర్‌నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి

పనులను పరిశీలించిన పి. విజయ రెడ్డి

**ప్రజానావ, ఖైరతాబాద్:** ఖైరతాబాద్ నియోజకవర్గం ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని బీజేఆర్ నగర్ బస్తీలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా చేపట్టిన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం విజయవంతంగా పూర్తయింది. కార్పొరేటర్ బడ్జెట్ నుంచి మంజూరైన రూ.10 లక్షల వ్యయంతో మూడు నెలలుగా సాగుతున్న ఈ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. శనివారం మాజీ కార్పొరేటర్, ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు పీ విజయ రెడ్డి అధికారులతో కలిసి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణం పూర్తయిన అంతర్గత రహదారులను జిహెచ్ఎంసి ఏఈ భరత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో కలిసి విజయ రెడ్డి పరిశీలించారు. రోడ్ల నాణ్యత, ఫినిషింగ్ అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన మూడు నెలల గడువులోనే పనులను పూర్తి చేసి, స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన రోడ్లను అందుబాటులోకి తెచ్చినందుకు జీహెచ్ఎంసీ అధికారులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. బస్తీల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు తాము ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో బస్తీ ప్రజలు పాల్గొన్నారు.



# చలో సెక్రటేరియట్ ఉద్రిక్తం

అరెస్టయిన ఉద్యమకారులను విడిపించిన కవిత!

మెహదీపట్నం పోలీస్ స్టేషన్‌లో బైఠాయించి నిరసన



**ప్రజానావ, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ శనివారం చేపట్టిన 'చలో సెక్రటేరియట్' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సచివాలయ ముట్టడికి యత్నించిన ఉద్యమకారులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుని మెహదీపట్నం, నాంపల్లి, పంజాగుట్ట తదితర పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మెహదీపట్నం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని అరెస్టయిన వారికి మద్దతుగా నిలిచారు. ఉద్యమకారులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆమె అక్కడే భీష్మించుకుని కూర్చోవడంతో పోలీసులు చివరకు వారిని విడుదల చేశారు. అనంతరం ఉద్యమకారులను వెంటబెట్టుకుని ఆమె ఠాణా నుంచి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. స్వరాష్ట్రంలోనూ ఉద్యమకారులను జైల్లో పెట్టడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా అమరవీరుల కుటుంబాలకు ఇస్తామన్న పెన్షన్, భూమి వంటి వాగ్దానాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. గతంలో తాము ఒత్తిడి తెచ్చినప్పుడు ఉద్యమకారుల సంక్షేమ బిల్లు పెడతామని అసెంబ్లీలో హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ ఊసే ఎత్తకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే కాంగ్రెస్ నేతలు రేపు బయట తిరిగే పరిస్థితి ఉండదని ఆమె హెచ్చరించారు. ఉద్యమకారుల హక్కుల సాధనలో తెలంగాణ జాగృతి ఎప్పుడూ ముందుంటుందని కవిత స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇస్తామన్న భూమిని వెంటనే పంపిణీ చేయాలని, లేనిపక్షంలో జాగృతి ఆధ్వర్యంలోనే భూపోరాటాలు చేపట్టి భూములను ఆక్రమించుకుంటామని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉద్యమకారులెవరూ అధైర్యపడొద్దని, పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో మన హక్కులను సాధించుకోవడం పెద్ద విషయం కాదని ఆమె భరోసా ఇచ్చారు. ఇప్పటికే జాగృతి తరపున భూపోరాటాలను ప్రారంభించామని, మున్ముందు ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో జాగృతి కార్యకర్తలు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

# ముంబై - హైదరాబాద్ మధ్య 'సమ్మర్ స్పెషల్' రైళ్లు!

- 23 నుంచి జూలై 9 వరకు వీక్లీ సర్వీసులు
- నిజామాబాద్, కామారెడ్డి, సికింద్రాబాద్ మీదుగా రాకపోకలు
- వేసవి రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు ఊరట

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్ర రాజధాని ముంబై నుంచి హైదరాబాద్ మధ్య ప్రయాణించే వారి కోసం సెంట్రల్ రైల్వే శుభవార్త చెప్పింది. వేసవి సెలవుల దృష్ట్యా ఏర్పడే ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక వీక్లీ సమ్మర్ స్పెషల్ రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 23 నుంచి జూలై 9, 2026 వరకు ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. ఈ నిర్ణయం వల్ల వేసవి కాలంలో టిక్కెట్ల కోసం ఇబ్బంది పడే ప్రయాణికులకు పెద్ద ఊరట లభించనుంది. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, రైలు నెం. 01011 ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ (ముంబై) నుంచి ప్రతి గురువారం అర్ధరాత్రి 00:20 గంటలకు బయలుదేరి, అదే రోజు రాత్రి 7:50 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నెం. 01012 హైదరాబాద్ నుంచి రాత్రి 10:00 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 8:30 గంటలకు ముంబై చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైలు రెండు వైపులా కలిపి మొత్తం 12 ట్రిప్పుల పాటు సేవలు అందించనుంది. ఈ సమ్మర్ స్పెషల్ రైలు ప్రయాణ మార్గంలో నాసిక్, మన్మాడ్, నాందేడ్, నిజామాబాద్, కామారెడ్డి మరియు సికింద్రాబాద్ వంటి ప్రధాన స్టేషన్లలో ఆగుతుంది. దీనివల్ల కేవలం ముంబై, హైదరాబాద్ నగరాల వారికే కాకుండా, ఉత్తర తెలంగాణ మరియు మహారాష్ట్రలోని కీలక ప్రాంతాల ప్రయాణికులకు కూడా ఎంతో మేలు చేకూరనుంది. వేసవి సెలవుల్లో సొంత ఊర్లకు వెళ్లేవారికి మరియు పర్యాటకులకు ఈ రైలు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది.



# కోర్టు ధిక్కరణ

అత్తాపూర్ ఆర్డీవోకు నెల రోజులు జైలు శిక్ష!

పెద్ద షాపూర్ భూ వివాదంలో హైకోర్టు సంచలన తీర్పు

**ప్రజానావ, హైదరాబాద్:** న్యాయస్థానం జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించినందుకుగాను అత్తాపూర్ ఆర్డీవోకు హైకోర్టు నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. కోర్టు ధిక్కరణ కింద ఈ శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా కూడా విధించింది. ప్రభుత్వ అధికారులు న్యాయస్థాన ఆదేశాల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని ఈ తీర్పు ద్వారా కోర్టు స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్ద షాపూర్‌లోని సర్వే నంబర్లు 172-183 లలో ఉన్న సుమారు 74 ఎకరాల సీలింగ్ ల్యాండ్ వివాదంపై గతంలో హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. ఈ భూ వివాదానికి సంబంధించి విచారణ జరిపి, నిర్ణీత గడువులోగా ఉత్తర్వులు జారీ చేయాలని అత్తాపూర్ ఆర్డీవోను కోర్టు ఆదేశించింది. అయితే, న్యాయస్థానం సూచించిన సమయం ముగిసినప్పటికీ ఆర్డీవో నుంచి ఎలాంటి ఉత్తర్వులు వెలువడకపోవడంతో బాధిత పక్షానికి చెందిన యూసుఫుద్దీన్ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగానే అమలు చేయలేదని నిర్ధారించింది. ఈ మేరకు ఆర్డీవోకు నెల రోజుల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది. ఒకవేళ జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు వారాల పాటు జైలు శిక్షను పొడిగించాలని ఆదేశాల్లో పేర్కొంది. అయితే, నిందితుడు ఈ తీర్పుపై పైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలును రెండు వారాల పాటు నిలిపివేస్తూ కోర్టు నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ యంత్రాంగంలో న్యాయపరమైన ఆదేశాల పట్ల అలసత్వం వహిస్తే ఫలితాలు ఇలాగే ఉంటాయని ఈ తీర్పు నిరూపించింది.

# మహిళా సెక్రటరీ దారుణ హత్య

ఆఫీసులోనే సంచిలో మృతదేహం!

నిందితుడైన అడ్వకేట్, అతని భార్య, కుమార్తె అరెస్ట్

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్ర సాంస్కృతిక రాజధాని పుణెలో ఒక దిగ్భ్రాంతికరమైన హత్యోదంతం వెలుగులోకి వచ్చింది. అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో, అడ్వకేట్ సంజయ్ సావంత్ తన భార్య, మైనర్ కుమార్తెతో కలిసి ఒక మహిళను దారుణంగా హత్య చేశాడు. మృతురాలిని పూనమ్ దినేష్ మున్(35)గా పోలీసులు గుర్తించారు. నిందితులు హత్య చేసిన తర్వాత మృతదేహాన్ని ఒక సంచిలో కుక్కి ఆఫీసులోనే దాచిపెట్టడం స్థానికంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అడ్వకేట్ సంజయ్ సావంత్, అతని భార్య స్వాతి మరియు వారి మైనర్ కుమార్తెను అదుపులోకి తీసుకున్నారు. మృతురాలు పూనమ్ మూడున్నరేండ్లుగా ముంధ్వాలోని అడ్వకేట్ సంజయ్ సావంత్ కార్యాలయంలో సహాయకురాలిగా పనిచేస్తోంది. అయితే, ఆమెకు తన భర్తతో అక్రమ సంబంధం ఉందనే అనుమానం సంజయ్ భార్య స్వాతికి కలిగింది. ఈ విషయమై గురువారం (ఏప్రిల్ 16) కార్యాలయంలో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన సంజయ్ సావంత్ కుటుంబం పూనమ్‌పై దాడికి దిగింది. ఆమె కాళ్లు, చేతులను తాడుతో కట్టివేసి, క్రికెట్ బ్యాట్‌తో పదేపదే కొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. హత్య చేసిన అనంతరం సాక్ష్యాలను తుడిచిపెట్టేందుకు నిందితులు పథకం వేశారు. మృతదేహాన్ని ఒక పెద్ద సంచిలో పెట్టి కార్యాలయంలోనే దాచారు. చీకటి పడిన తర్వాత మరుసటి రోజు ఎక్కడైనా పారవేయాలని భావించారు. అయితే పూనమ్ భర్త దినేష్ మున్ అప్రమత్తతతో ఈ పాపం వెలుగులోకి వచ్చింది. రాత్రి పొద్దుపోయినా తన భార్య ఇంటికి రాకపోవడంతో దినేష్ ఆందోళన చెంది సంజయ్‌కు ఫోన్ చేయగా, ఆమె బంధువుల ఇంటికి వెళ్లి ఉంటుందని చెప్పి అతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశాడు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు రాత్రి 11 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం వెతుకులాట ప్రారంభించిన భర్త దినేష్ మున్, నేరుగా సావంత్ కార్యాలయానికి చేరుకున్నాడు. అక్కడ రక్తపు మరకలతో ఉన్న సంచిని చూసి నిర్ఘాంతపోయాడు. దాన్ని తెరిచి చూడగా తన భార్య మృతదేహం కిరాతకంగా సంచిలో కుక్కి ఉండటం చూసి తల్లడిల్లిపోయాడు. సమాచారం అందుకున్న ముంధ్వా పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అరెస్ట్ చేశారు. వృత్తిరీత్యా చట్టాన్ని కాపాడాల్సిన న్యాయవాదే ఇలాంటి అకృత్యానికి పాల్పడటం పుణె నగరంలో చర్చనీయాంశంగా మారింది.

# మతమార్పిడికి ఒత్తిడి

యువతిపై లైంగిక దాడి

నిందితుడిని అరెస్ట్ చేసిన పంచవటి పోలీసులు

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని నాసిక్‌లో మతమార్పిడి పేరుతో యువతిపై జరిగిన లైంగిక దాడి ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. ఇటీవల సంచలనం సృష్టించిన టీసీఎస్ కేసు మరువకముందే ఈ వికృత ఘటన వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది. తంజీర్ ఇనామ్‌దార్ అనే యువకుడు ఒక యువతిని ప్రేమ పేరుతో నమ్మించి, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఈ దారుణానికి పాల్పడినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణను వేగవంతం చేశారు. బాధితురాలి వివరాల ప్రకారం.. నిందితుడు తంజీర్ ఇనామ్‌దార్ బాధితురాలిని లోబర్చుకుని మద్యం తాగించాడు. ఆమె స్పృహలో లేని సమయంలో పలుమార్లు లైంగికదాడి చేశాడు. అంతటితో ఆగకుండా బాధితురాలి మెడలోని తులసి దండను బలవంతంగా తెంచి వేసి, ఆమెను మతమార్పిడి చేసుకోవాలని తీవ్రంగా ఒత్తిడి చేసినట్లు సమాచారం. నిరంతరం వేధింపులకు గురిచేస్తూ ఆమె మతాన్ని మార్చడానికి ప్రయత్నించడం ఈ కేసులో అత్యంత తీవ్రమైన అంశంగా మారింది. స్పృహలో లేని సమయంలో తీసిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తానని బాధితురాలిని నిందితుడు బెదిరించాడు. ఆ ఫొటోలను చూపిస్తూ బ్లాక్ మెయిల్ చేస్తూ పలు లాడ్జీలకు తీసుకువెళ్లి అకృత్యాలకు పాల్పడినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ వేధింపులు భరించలేక బాధితురాలు పంచవటి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తక్షణమే స్పందించి నిందితుడు తంజీర్ ఇనామ్‌దార్‌ను అరెస్ట్ చేశారు. ఈ ఘటన వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా లేదా అనే కోణంలో పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తున్నారు.

